
సాక్షి
ప్రకాశం
సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



ధరల దాడు!
నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. కూరగాయల ధరలూ మండిపోతున్నాయి. పెరిగిన ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతున్నారు.
- 8లో..



ఎస్సీ వర్గీకరణను నిలిపేయాలి
టీడీపీలోని మాల ఎమ్మెల్యేలు, ఎంపీలు చంద్రబాబుతో మాట్లాడి ఎస్సీ వర్గీకరణను నిలిపేయించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు కోరారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
36/27

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

నాడిపట్టే వారేరీ..!


వైద్యుల సమ్మెతో చందలూరు పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్యుని కుర్చీ

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు పేదల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం అక్కడ పనిచేసే వైద్యుల కనీస డిమాండ్‌లను పరిష్కరించడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబించడంతో గత్యంతరం లేక వారు నిరసన బాట పట్టారు. ఫలితంగా వారం రోజులుగా పీహెచ్‌సీలలో వైద్యసేవలు నిలిచిపోయాయి. సీజనల్ జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంత పేదలు విలవిల్లాడుతున్నారు.

- పీహెచ్‌సీ వైద్యుల సమ్మెతో పల్లెల్లో ఆగిన వైద్యం
- వారం రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం
- సీజనల్ వ్యాధులతో పాటు ప్రబలిన విషజ్వరాలు
- ఇంటింటికీ జ్వర బాధితులు
- వైద్యం చేసే దిక్కులేక ఆర్‌ఎంపీల దగ్గర క్యూ కడుతున్న పల్లె ప్రజలు

ఒంగోలు టౌన్: ఒక పక్క సీజనల్ వ్యాధులు, జ్వరాలు.. మరోవైపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సమ్మె. దీంతో గ్రామీణ ప్రజలు వైద్యం కోసం అల్లాడిపోతున్నారు. పీహెచ్‌సీల్లో వైద్యం లభించకపోవడంతో ఆర్‌ఎంపీల దగ్గరకు పరుగులు పెడుతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాలకు గ్రామాలు జ్వరంతో మంచం పట్టాయి. సాధారణ సీజనల్ జ్వరాలతో పాటుగా డెంగీ జ్వరాలు సైతం చాపకింద నీరులా ప్రబలుతున్నాయి. రోజురోజుకూ డెంగీ బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. నిన్నా మొన్నటి వరకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుశిక్షితులైన వైద్యులు అందుబాటులో ఉండేవారు. జ్వరం వచ్చినా, జలుబు చేసినా, దగ్గు వేధిస్తున్నా వైద్య చికిత్స చేసేవారు. అవసరమైతే రక్త పరీక్షలు చేసేవారు. నాణ్యమైన మందులిచ్చి పంపించేవారు. మూడు నెలల క్రితం నుంచి పరిస్థితి పూర్తిగా మారింది. పట్టణాల్లో ఒకవర్గం గుప్పిట్లో ఉన్న ఆస్పత్రులకు లాభాల పంట పండించేందుకు ఒక వ్యూహం ప్రకారం ప్రభుత్వ వైద్యాన్ని నిర్వీర్యం చేయడం మొదలైంది. ఈ క్రమంలోనే కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే స్పెషలిస్ట్ వైద్యులను తీసేశారు. నెల రోజులు కూడా తిరగకుండానే ప్రాథమిక వైద్యశాలల్లో వైద్యుల భవిష్యత్తును దెబ్బతీస్తూ జీవో నంబర్ 85ను జారీ చేశారు. దాంతో పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టారు. వైద్యుల సమ్మెతో పీహెచ్‌సీల్లో వైద్యం ఆగిపోయింది. గ్రామాల్లో పీహెచ్‌సీలు ఉన్నప్పటికీ వైద్యం అందుబాటులో లేని దుస్థితిని తీసుకొచ్చారు. 'జ్వరం వస్తుంది సార్ కాస్త చికిత్స చేయించండి' అంటూ ప్రజలు వేడుకుంటుంటే 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ స్టిక్కర్లు చేతిలో పెట్టి ఇప్పటికి దీంతో సరిపెట్టుకో అంటూ ప్రజా ప్రతినిధులు మొహం తిప్పుకొని వెళ్లిపోతున్నారని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు.

పీహెచ్‌సీ వైద్యులు ఎందుకు సమ్మె చేస్తున్నారంటే...
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యులకు పీజీ చేసేందుకు ఉన్న అవకాశాలను దెబ్బతీస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 85 జారీ చేసింది. గతంలో గ్రామీణ ప్రాంతంలో మూడేళ్లపాటు పనిచేసిన వైద్యులకు, రెండేళ్లపాటు గిరిజన ప్రాంతాల్లో పనిచేసిన వైద్యులకు పీజీ చేసేందుకుగాను 30 శాతం కోటా ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం వచ్చీ రాగానే 30 శాతం ఉన్న కోటాను 15 శాతానికి తగ్గించింది. అంటే సగానికి సగం సీట్లలో కోత పెట్టింది. తమ భవిష్యత్తును దెబ్బతీసే ఈ అన్యాయమైన జీవోను రద్దు చేయాలని కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లను కలిసి వినతి పత్రం అందజేశారు. అయినా ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయింది. ముఖ్యమంత్రి వైఖరి మింగుడుపడని వైద్యులు తొలుత నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవడం ద్వారా తమ నిరసన తెలియజేశారు. అయినాసరే పాలకులు పట్టించుకోలేదు. ఇకలాభం లేదనుకున్న పీహెచ్‌సీ వైద్యులు గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మె నోటీసు ఇచ్చారు. కనీసం గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొనైనా పీహెచ్‌సీ వైద్యులు సమ్మెకు వెళ్లకుండా నిలువరించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు మిన్నకుండిపోయింది. దాంతో పీహెచ్‌సీ వైద్యులు విధులు బహిష్కరించారు. అత్యవసర సేవలను మినహాయించి వైద్య సేవలను అందించకూడదని నిర్ణయం తీసుకున్నారు. అప్పటికీ ప్రభుత్వం లెక్కచేయలేదు. 5 రోజులుగా అత్యవసర సేవలను సైతం ఆపేసి పూర్తిస్థాయిలో పోరాటం చేపట్టారు. ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తే ప్రభుత్వానికి గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై ఏమాత్రం బాధ్యత లేదని తేటతెల్లమవుతోంది. అంతేకాకుండా గ్రామీణ వైద్యాన్ని దెబ్బతీసే కుట్రలు చేస్తున్నట్లుగా భావించాల్సి వస్తుందని ప్రజా సంఘాలు అనుమానిస్తున్నాయి.

ఒక్క ప్రమోషన్ కూడా లేకుండానే...
ఈ ఒక్కటే కాదు టైం బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని పీహెచ్‌సీ వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ఉద్యోగంలో చేరిన వైద్యులు అదే హోదాలో రిటైర్డ్ కావడం వైద్యులను ఆవేదనకు గురిచేస్తోంది. ఏ ప్రభుత్వ శాఖలో లేని ఈ విధానం ఒక్క వైద్యశాఖలో మాత్రమే ఇలా ఎందుకు జరుగుతుందని పీహెచ్‌సీ వైద్యుల ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా 6 ఏళ్లపాటు విధులు నిర్వహిస్తున్న వైద్యులకు డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తరువాత సివిల్ సర్జన్‌గా ప్రమోషన్ ఇవ్వాలి. కానీ వైద్యశాఖలో అలా జరగడం లేదు. జిల్లాలో 20 నుంచి 24 సంవత్సరాలుగా సివిల్ అసిస్టెంట్ వైద్యులుగానే విధులు నిర్వహిస్తున్న వారు ఉన్నారు. ఈ అన్యాయాన్ని కూడా సరిదిద్దాలని కోరుతున్నారు. తమకు టైం బౌండ్ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్రైబల్ అలవెన్స్ ఇవ్వండి మహాప్రభో...
వైద్యశాఖలో గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న వైద్యులకు ప్రత్యేక అలవెన్సులు ఇస్తారు. స్పెషలిస్టు వైద్యులకు 50 శాతం, సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు 30 శాతం అలవెన్సు ఇస్తారు. అయితే ఇది పూర్తిగా అమలు చేయడం లేదు. నిజంగా ఎవరైతే గిరిజన ప్రాంతంలో ఉన్న ప్రాథమిక వైద్యశాలలో పని చేస్తున్నారో.. వారికి అలవెన్సులు ఇవ్వకుండా జిల్లా వైద్యశాలల్లో పనిచేస్తున్న వైద్యులకు మాత్రమే అలవెన్సులు ఇస్తున్నారు. జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఉన్న పాలుట్ల వైద్యశాలకు వెళ్లాలంటేనే 6 గంటలకు పైగా పడుతుంది. రవాణా సౌకర్యం కూడా సరిగా ఉండదు. పుల్లలచెరువు, ముటుకుల, యర్రగొండపాలెం, కొరబోలు, చింతల, వెంకటాద్రిపాలెం, అర్ధవీడు, పాలుట్ల, యాచవరం, కిష్టం శెట్టిపల్లె తదితర 11 ట్రైబల్ పీహెచ్‌సీలు ఉండగా కేవలం మార్కాపురం జిల్లా వైద్యశాలలో పని చేసేవారికి మాత్రమే అలవెన్సులు ఇవ్వడం తగదని, అందరికీ న్యాయం చేయాలని కోరుతున్నారు.

వైద్యం కోసం అప్పులు:
ప్రభుత్వ వైద్యం ఆగిపోవడంతో వైద్యం కోసం గ్రామీణ ప్రజలు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు వైద్యశాలలో సామాన్య జ్వరానికి కూడా కనీసం రూ.10 వేలు ఖర్చవుతుంది. రక్త పరీక్షలకే రూ.2 నుంచి రూ.4 వేలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇక డెంగీ లాంటి జ్వరాలు వస్తే రోజుకు రూ.10 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒక వారం రోజులు వైద్యశాలలో ఉండి చికిత్స చేయించుకోవాలంటే కనీసం లక్ష రూపాయలు ఖర్చు చేయక తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితిలో గ్రామీణ ప్రజలు అప్పులు చేయడం తప్పడం లేదని వాపోతున్నారు.

జిల్లాలో 70 పీహెచ్‌సీలలో ఆగిన వైద్య సేవలు...
జిల్లాలో మొత్తం 70 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఇద్దరేసి వైద్యులను గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. వారితోపాటుగా ఇతర వైద్యులు కలిపి 150 మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. మారుమూల పాలుట్ల అటవీ ప్రాంతంలో కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్నారంటే ప్రజల ప్రాణాలకు ఎంతగా ప్రాధాన్యం ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోని 70 ప్రాథమిక వైద్యశాలల్లో రోజుకు కనీసం 7 వేల నుంచి 10 వేల మంది వరకు వైద్య చికిత్సలు పొందుతున్నారు. వీరంతా సామాన్య నిరుపేదలు, మధ్య తరగతికి చెందిన రైతులు, రైతు కూలీలే. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి వేలకు వేలు ఖర్చుచేసే స్తోమత లేనివారే. ఇప్పుడు వీరి పరిస్థితి ఏమిటి.. వైద్యం కోసం ఎక్కడకు వెళ్లాలని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

గత్యంతరం లేకనే సమ్మెబాట



నిజానికి మేం ఎప్పుడో సమ్మె చేయాలనుకున్నాం. సరిగా అప్పుడే రాష్ట్రంలో వరదలు వచ్చాయి. కోవిడ్‌లో ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందించిన మేము ఇలాంటి పరిస్థితిలో సమ్మె చేయడం భావ్యం కాదని వాయిదా వేసుకున్నాం. అంతేకాదు సమ్మె చేయడానికంటే ముందు సమస్య పరిష్కారం కోసం ఎంతో ఆశతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లను కలిసి మాకు న్యాయం చేయమని అడిగాం. గత్యంతరం లేని పరిస్థితిలోనే సమ్మె చేస్తున్నాం. ఇన్ సర్వీస్ కోటా 30 శాతం కొనసాగించాలి. ఈ ప్రధానమైన డిమాండ్‌కు ప్రభుత్వం ఒప్పుకుంటుందన్న నమ్మకం ఉంది.
– డా.రాహుల్, పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు

మా భవిష్యత్తును దెబ్బతీసే జీవో



జీవో 85 మా భవిష్యత్తును తీవ్రమైన దెబ్బతీస్తుంది. ఇన్నాళ్లు మేము చేసిన సర్వీస్ సంగతేంటి. గత సంవత్సరం వరకు 30 శాతం కోటా అమలులో ఉండడంతో 500 మందికి పైగా పీజీ కోర్సులకు వెళ్లారు. 30 శాతం నాన్ క్లినికల్, 50 శాతం క్లినికల్ సబ్జెక్టుకు ఇచ్చారు. ఈ సంవత్సరం సగానికి సగం తగ్గించారు. 30 శాతం నాన్ క్లినికల్, 15 శాతం క్లినికల్ ఇచ్చారు. దాంతో ఈ ఏడాది కేవలం 180 మంది మాత్రమే పీజీలకు వెళ్లారు. ఇది చాలా అన్యాయం. ఈ జీవో రద్దు చేయాలి.
– డా.ఖాదర్ మస్తాన్ బి, పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా కార్యదర్శి

న్యూస్‌రీల్

శ్రీవేణికి శాలివాహన విశిష్ట ప్రతిభా పురస్కారం


శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు చేత సన్మానం అందుకుంటున్న శ్రీవేణి

కొండెపి (సింగరాయకొండ): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా విద్యారంగంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ గురువులకు అందించే శాలివాహన విశిష్ట ప్రతిభా పురస్కారం 2024ను మండలంలోని దేవిరెడ్డిపాలెం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ఉప్పుటూరి శ్రీవేణి దక్కించుకున్నారు. ఈ పురస్కారాన్ని ఆదివారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అందుకున్నారు. శ్రీవేణిని దేవిరెడ్డిపాలెం, కే.ఉప్పలపాడు గ్రామస్తులు అభినందించారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలపై అప్సా పోరాటం


ప్రైవేటు స్కూల్స్ జిల్లా మహాసభలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: ప్రైవేటు పాఠశాల సమస్యలపై ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ నిరంతర పోరాటాలు చేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు గొల్లపూడి మోహన్‌రావు చెప్పారు. నగరంలోని మల్లయ్యలింగం భవనంలో ఆదివారం నిర్వహించిన జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వరద బాధితులకు సాయం అందించడంలో అసోసియేషన్ క్రియాశీలకంగా వ్యవహరించిందని, ఇప్పటి వరకు రూ.1.30 కోట్లు అందజేసిందని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి దిక్సూచి లాంటి వారని చెప్పారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో నాయకులు హరిబాబు, కె.ప్రభాకరరావు, షేక్ కరీముల్లా, సీహెచ్ రాము, ఎం.శ్రీనివాసరావు, సాయికిరణ్, షేక్ జమీర్, సత్యనారాయణ, కొండగురబయ్య పాల్గొన్నారు.

పీడీసీసీబీ స్టాఫ్ యూనియన్ సర్వసభ్య సమావేశం


నూతన యూనియన్ కమిటీ సభ్యులు

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు అనుబంధంగా పనిచేస్తున్న పీడీసీసీబీ స్టాఫ్ యూనియన్ సర్వసభ్య సమావేశం ఆదివారం కర్నూలు రోడ్డులోని ట్రెండ్స్ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు టి.వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ డీసీసీబీ ఉద్యోగులు ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లలో ఎదురవుతున్న సమస్యలు, సబ్‌స్టాఫ్ సర్వీస్ నుంచి ప్రమోట్ అయిన వారికి వెయిటేజ్ ఇంక్రిమెంట్లు, దీర్ఘకాలంగా సస్పెన్షన్‌లో ఉన్న ఉద్యోగుల పునర్నియామకం వంటి సమస్యల గురించి చర్చించినట్లు తెలిపారు. అనంతరం యూనియన్ కు మూడేళ్ల కాలానికి నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఫౌండర్ ప్రెసిడెంట్‌గా ఎస్.హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జె. కృష్ణారెడ్డి, అధ్యక్షునిగా ఎల్.వి.మహేష్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నాగార్జునరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా జి.ప్రశాంత, వి.ఏడుకొండల నాయక్, సంయుక్త కార్యదర్శిగా ఎం.రామకృష్ణ, కోశాధికారిగా పి.చైతన్య, డైరెక్టర్లుగా రజనీకుమారి, వెంకటేశ్వర్లు, ప్రసన్న కోటేశ్వరి, లావణ్య, రవీంద్రప్రసాద్, సుస్మిత ఎన్నికై నట్లు తెలిపారు. రాష్ట్ర అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గా జిల్లా నుంచి అట్ల శ్రీనుని ప్రతిపాదించినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనక గోపినాథ్, ముఖ్య సలహాదారు భోగాది శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు కామేపల్లి విద్యార్థులు

జరుగుమల్లి (సింగరాయకొండ): రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు జరుగుమల్లి మండలం కామేపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎల్ అనూరాధ తెలిపారు. పాకల జెడ్పీ హైస్కూల్లో శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 విభాగంలో బి.అభిషేక్, ఎం.కార్తీక్, కె.బాలచరణ్, ఎం.పాల్‌రాజ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు నర్రా కోటేశ్వరరావు తెలిపారు. వీరు అక్టోబర్‌లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

ఎవరూ తగ్గడంలే..!



- మాజీ మంత్రి బాలినేని, ఎమ్మెల్యే దామచర్ల మధ్య మాటల యుద్ధం
- పార్టీ మారినా కేసుల నుంచి తప్పించుకోలేరన్న దామచర్ల
- తాను రాజీపడబోనంటున్న బాలినేని

ఒంగోలు టౌన్/టంగుటూరు: మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఇటీవల జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను కలిసిన బాలినేని ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఒంగోలు రాజకీయాలు కొత్త మలుపు తిరిగాయి. మొదట్నుంచి ఉప్పు నిప్పులా ఉండే బాలినేని, దామచర్ల ఇప్పుడు ఒక కూటమిలో కత్తులు దూసుకుంటున్నారు. ఒకరి మీద మరొకరు విమర్శలు చేసుకుంటున్నారు. శుక్రవారం బాలినేని అభిమానులు కొందరు నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వివాదాన్ని మరింత రాజేశాయి. ఈ ఫ్లెక్సీల్లో ఎమ్మెల్యే దామచర్ల ఫొటో కూడా ముద్రించడం టీడీపీ శ్రేణులకు మింగుడు పడలేదు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసి వెంటనే వాటిని తొలగించడమే కాకుండా ఇలాంటి ఫ్లెక్సీలు మరోసారి వేస్తే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఆలూ లేదు సూలు లేదు అన్నట్లు ఇంకా పార్టీలో చేరక ముందే ఇలా ఉంటే రానురాను ఈ ఇరుపార్టీల మధ్య పరిస్థితి ఇంకెలా ఉండబోతుందో చూడాలి.

ఏ పార్టీలోకి వెళ్లినా వదలను..: ఎమ్మెల్యే దామచర్ల
బాలినేని వంటి అవినీతిపరుడిని ఏ పార్టీలోకి వెళ్లినా వదిలేదే లేదని, అతనిని, అతని కుమారుడిని చట్టపరంగా శిక్షిస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అన్నారు. టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన దామచర్ల ఆంజనేయులు 17వ వర్ధంతి సభలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిపై ఒంగోలు టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాట్ కామెంట్స్ చేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ "గత ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలు పోరాటం చేశాం. ఒంగోలులో టీడీపీ శ్రేణులు, నాపై బాలినేని 32 కేసులు పెట్టారు. మా నాయకుడు చంద్రబాబుని కూడా దూషించారు. అధికారం పోయి వంద రోజులు గడవక ముందే పార్టీ మారుతున్నారు. జనసేన పార్టీలో చేరకముందే బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఏ పార్టీలోకి వెళ్లినా కేసుల్లో నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కొడుకు తప్పించుకోలేరు. గత ఐదేళ్లలో ఆయన చేసిన అక్రమాలను బయటకు తీస్తాం, వాటి నుంచి పవన్ కళ్యాణ్ కూడా కాపాడలేరు. ఎన్నికల్లో కష్టపడి పని చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకి అండగా ఉంటాం. పార్టీలు మారే పరిస్థితి వస్తే మేము రాజకీయాలు కూడా మానుకుంటాం.." అని దామచర్ల జనార్దన్ అన్నారు.

నేనెప్పుడూ కాంప్రమైజ్ కాను.. బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి
"నేనెప్పటికీ కాంప్రమైజ్ కాను. జనసేన ఫ్లెక్సీలు ఎవరు వేశారో నాకు తెలియదు. ఆయన బొమ్మేశారని తీసేయమన్నాడంటా, సంతోషమే... ఆయన బొమ్మ వద్దంటే తీసేద్దాం" అని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్ నుంచి ఒంగోలు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేసిన కామెంట్స్‌పై వివరణ ఇచ్చారు. స్థానికంగా టీడీపీ ఎమ్మెల్యే ఉన్నాడని, జనసేన నాయకులకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అడిగానని, అంతకుమించి తానేమీ మాట్లాడలేదన్నారు. దాని మీద కూడా ఆయన అనవసరంగా ఏదేదో మాట్లాడుతున్నారని, ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళతానని చెప్పారు. తాను జనసేనలోకి వెళ్లడం ఇష్టం లేకనే రెచ్చగొట్టేందుకు కావాలని ఆయన మాట్లాడుతున్నారని చెప్పారు. పవన్ కళ్యాణ్ కూడా ఏం చేస్తాడో చూస్తానంటూ ఏదేదో మాట్లాడుతున్నాడని విన్నానని, అంతపనికి రాడు... ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ప్రశ్నించేందుకే జనసేన పార్టీ పెట్టానని పవన్ కళ్యాణ్ చెబుతున్నారని, ఇప్పుడు కూడా ఏదైనా తప్పులు జరిగితే తాను ప్రశ్నిస్తానన్నారు. జనసేన పార్టీలో ఉన్న పాతవారిని, తనతో పాటు వస్తున్న వారిని కలుపుకొని జనసేన బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు.

'సూపర్ సిక్స్' త్వరగా అమలు చేయాలి


వ్యవసాయ కార్మిక సంఘ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆవులు శేఖర్

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నింటినీ త్వరగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందిపై అధికారులు, ప్రజా ప్రతినిధుల ఒత్తిడి చేయడం ఎక్కువైందని, సిబ్బందికి ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి సిబ్బందిపై రాజకీయ వేధింపులు ఆపాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం సక్రమంగా అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో భూ సమస్యలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల రుణం అందజేయాలన్నారు. జిల్లాలో చాలా ప్రాంతాల్లో పేదలకు పంచడానికి ప్రభుత్వ భూములు ఉన్నాయని, తక్షణమే భూమిలేని పేదలను గుర్తించి వారికి పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం ఎస్‌డీ మౌలాలి అధ్యక్షత వహించారు. జిల్లా నాయకులు ఆర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే అభివృద్ధి


వీసీ ప్రొఫెసర్ మూర్తిని సత్కరిస్తున్న అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

- ఏకే విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మూర్తి

ఒంగోలు సెంట్రల్: సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే అభివృద్ధి చెందుతామని ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మూర్తి అన్నారు. అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ (ఏపీటీఎల్) సంఘానికి దశాబ్దం పూర్తయిన సందర్భంగా ఒంగోలు ఏకేయూలో నూతన విద్యావిధానం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ సలహాదారు డాక్టర్ నూకతోటి రవికుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ మూర్తి మాట్లాడుతూ నూతన విద్యావిధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని విద్యార్థులకు అవగాహన కల్పించి వారి ఉన్నతికి కృషి చేయాలని కోరారు. హర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, సింగరాయకొండ పీఎస్‌సీపీ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ గీతా రాణి, ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చెంచురామయ్య, అసోసియేషన్ గౌరవ అధ్యక్ష, కార్యదర్శులు టీ గోపాల్ రెడ్డి, టీ.ఎస్.ఎస్ సింగ్ మాట్లాడారు. వివిధ కళాశాలల సెక్రటరీ, కరస్పాండెంట్‌లు, ప్రిన్సిపాల్ అసోసియేషన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. 37 మందితో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

క్లుప్తంగా

బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి బత్తుల అభినందనలు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. యువకుడు, సమర్థుడు, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కార్యకర్తలు, కింది స్థాయి ప్రతినిధులతో సత్సంబంధాలు కలిగిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యేగా, అతని తల్లి బూచేపల్లి వెంకాయమ్మ జెడ్పీ చైర్‌పర్సన్‌గా మంచి ప్రజా సంబంధాలు కలిగి ఉండి పార్టీ కోసం అన్ని వనరులను వెచ్చించి పనిచేసేవారిగా గుర్తింపు ఉందని, బూచేపల్లి కుటుంబమంటే క్యాడర్‌కు నమ్మకం ఉందని బత్తుల పేర్కొన్నారు.

27న ఎస్‌జీఎఫ్ అండర్-17 అథ్లెట్ల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-17 అథ్లెట్ల ఎంపిక పోటీలు ఈనెల 27న మార్టూరు మండలం వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. 17 సంవత్సరాల విభాగంలో పాల్గొనే ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబర్‌ను సంబంధిత ప్రిన్సిపాల్ ధ్రువీకరణతో నిర్వాహకులకు సమర్పించాలని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు 9010040865ను సంప్రదించాలని సూచించారు.

9 మంది జూదరుల అరెస్ట్

● రూ.1,13,560 నగదు స్వాధీనం

పామూరు: జూదం ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1,13,560 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలోని కొత్తపల్లె గ్రామ పొలాల్లో చోటుచేసుకుంది. ఎస్సై టి.కిషోర్‌బాబుకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేసి పట్టుకున్నారు. ఎక్కడైనా పేకాట ఆడుతున్నా, కోడిపందేలు నిర్వహిస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.



నిప్పుల్లా మండుతున్న నిత్యావసరాలు


● లీటరు నూనెపై రూ.20 నుంచి రూ.25 పెంపు ● నూనె కృత్రిమ కొరతపై స్పందించని టీడీపీ కూటమి సర్కారు
● కిలో ఉల్లి ధర రూ.60, వెల్లుల్లి రూ.390 ● పైపైకి ఎగసిపడుతున్న కూరగాయల ధరలు
● ధరల నియంత్రణను గాలికొదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ● పేద, మధ్య తరగతి ప్రజల జీవనంపై పెను భారం

వంటింట్లో మంట

సామాన్యుల గోడు
ధరల దౌడు!

బేస్తవారిపేటకు చెందిన రాఘవది మధ్య తరగతి కుటుంబం. ప్రైవేట్ సంస్థలో చిరుద్యోగం చేస్తున్న రాఘవ నెల ఆదాయం రూ.18 వేలు. ఇంటి అవసరాలు, పిల్లల స్కూలు ఫీజు, ఫోన్ రీచార్జ్, పెట్రోలు ఖర్చులను నెల జీతంతో అతి కష్టమ్మీద నెట్టుకొస్తున్నాడు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో గత రెండు నెలలుగా కూరగాయల ధరలు పెరగడం, నిత్యావసర సరుకుల ధరలు దౌడు తీస్తుండటంతో ఆర్థికంగా సతమతమవుతున్నాడు.

జిల్లాలో కూలీనాలీ చేసుకుని రోజులు వెళ్లదీస్తున్న కుటుంబాలు ఇంతకంటే దయనీయ పరిస్థితులను చవిచూస్తున్నాయి. మధ్య తరగతి ప్రజలు నెలకు సరిపడా సరుకులు కొనడం మానేసి రెండు మూడు రోజులకు కావాల్సిన వస్తువులు కొంటున్నారు. వంటింట్లో నిత్యం వినియోగించే ఉల్లి, వెల్లుల్లి, నూనె ధరలు సామాన్యులకు తారెత్తిస్తున్నాయి.




బేస్తవారిపేట:

జిల్లాలో ఎక్కడ చూసినా నిత్యావసర వస్తువుల ధరలపైనే చర్చ నడుస్తోంది. కిరాణా కొట్లు మొదలు సూపర్ మార్కెట్ల వరకు పెరిగిన ధరలపై పెదవి విరుస్తున్న ప్రజలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై నిప్పులు చెరుగుతున్నారు. మొన్నటి వరకు మార్కెట్‌లో స్థిరంగా ఉన్న నూనె ధర ఒక్కసారిగా భగ్గుమనడంతో సామాన్యులు అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. కొందరు హోల్‌సేల్ వ్యాపారులు ఒక్కసారిగా నూనె ప్యాకెట్లను బ్లాక్ చేసి, అధిక ధరలకు విక్రయించడం ప్రారంభించారు. ఒక్కసారిగా పెరిగిన నూనె ధరలు చూసి కొనుగోలుదారులు అయోమయంలో పడిపోయారు. శుద్ధి చేసిన ఎడిబుల్ ఆయిల్‌పై కేంద్ర ప్రభుత్వం 32 శాతం దిగుమతి సుంకం పెంచడంతో నూనె ధరలకు రెక్కలొచ్చాయి. లీటర్ నూనెపై ఏకంగా 30 శాతం వరకు ధర పెరగడంతో సామాన్యుడి మీద పెనుభారం పడుతోంది. వారం క్రితం రూ.108–110 ఉన్న ఫ్రీడమ్ ఆయిల్ ధర నేడు రూ.125 చేరింది. సన్‌ఫ్లవర్ నూనె ఏకంగా రూ.115కు చేరింది. కిలో కందిపప్పు ధర రూ.185, ఎండుమిర్చి రూ.200, చింతపండు రూ.190.. ఇలా అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి.

సామాన్యులు ఉక్కిరిబిక్కిరి

గత ప్రభుత్వం సామాన్యులకు అండగా నిలిచింది. క్రమం తప్పకుండా ఆర్థిక తోడ్పాటు అందించింది. సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేసింది. ఈ క్రమంలో నిత్యావసర ధరలు అదుపుతప్పినా సామాన్యుల జీవనం ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా సాగింది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయింది. ఓ వైపు వర్షాభావం, మరో వైపు వరదలతో పంటలు పండక రైతులు, కూలీలు, సంక్షేమ పథకాలు అందక పేద ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

మంట పుట్టిస్తున్న కూరగాయలు



మార్కెట్‌లో కూరగాయల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండాపోతున్నాయి. సాధారణంగా ఏటా ఆగస్టు, సెప్టెంబర్‌లో కూరగాయ పంటల దిగుబడి అధికంగా ఉండి ధరలు సామాన్యులకు అందుబాటులో ఉంటాయి. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. బయట ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యే ఉల్లి, బంగాళాదుంప ధర అమాంతం పెరుగుతూ పోతోంది. టమోటా ధర తగ్గినట్టే తగ్గి పైపైకి లేస్తోంది. గత రెండు నెలలుగా ఉల్లి ధర కిందకు దిగనంటోంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లి ధర రూ.60, వెల్లుల్లి రూ.390 పలుకుతోంది. టమోటా కేజీ రూ.40, బంగాళాదుంప రూ.50, బీరకాయలు రూ.60, తెల్ల వంకాయలు రూ.40, నల్ల వంకాయలు రూ.40, దొండకాయలు రూ.40, క్యారెట్ రూ.80, బెండకాయలు రూ.40, పచ్చిమిర్చి రూ.80, సొరకాయ రూ.30, చామదుంపలు రూ.80, చిక్కుడుకాయలు రూ.100, గోరుచిక్కుడు రూ.50, క్యాబేజీ రూ.40, క్యాలీఫ్లవర్ కేజీ రూ.60 వరకు పలుకుతోంది. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు పచ్చడి మెతుకులతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

ధరల పెరుగుదలపై కూటమి నేతల మౌనం

'కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తాం, సరసమైన ధరలకే నాణ్యమైన సరుకులు అందేలా చర్యలు తీసుకుంటాం' అని ఎన్నికల ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన నాయకులు ఇప్పుడు పత్తా లేరు. మూడు నెలల క్రితం సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో నిత్యావసర ధరలు పెరిగాయంటూ ఊరూవాడా విష ప్రచారం చేసిన వారు ఇప్పుడు నోరు మెదపడం లేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిత్యావసర సరుకుల ధరలు పెంచి సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చిన డబ్బు లాగేసుకుంటున్నాడని కాళ్లకు బలపాలు కట్టుకుని మరీ అబద్ధాలు వల్లెవేసిన కూటమి నాయకులు.. ప్రస్తుతం ధరల పెరుగుదల సామాన్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చేందుకు సాహసించడం లేదు. సరుకుల ధరలు విపరీతంగా పెరగడంపై పేద, మధ్య తరగతి ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.



నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల ఇలా..

రకం	ఈ ఏడాది జూన్‌లో ధర (రూ.లో)	ప్రస్తుత ధర (రూ.లో)
కంది పప్పు	130	185
శనగ పప్పు	75	100
పెసర పప్పు	110	120
మినప పప్పు	110	130
పల్లీలు	110	130
ఉల్లిపాయలు	25	60
జొన్నలు	35	42
రాగులు	35	40
సజ్జలు	25	30
చింతపండు	90	140
పంచదార	39	43
బెల్లం	45	55
ఎండుమిర్చి	200-250	300
బియ్యం (సూపర్‌ఫైన్)	1600	1800
పామోలిన్	95	115
వేరుశనగ నూనె	145	170
సన్ ఫ్లవర్ ఆయిల్	110	130

పెద్దదోర్నాలలో పొట్టేళ్ల దొంగతనం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శ్రీశైలం రహదారిలో ఉన్న గొర్రెల మందలో పొట్టేళ్లు చోరీకి గురైన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పొట్టేళ్ల వ్యాపారులు గుమ్మా ఎల్లయ్య, షేక్ కాశింసాలకు చెందిన జీవాలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు ఆదివారం వారు పోలీసులకు పిర్యాదు చేశారు. మందలో మొత్తం 99 గొర్రెలు ఉండగా, ఆదివారం మండల కేంద్రంలోని మటన్ వ్యాపారులకు కొన్ని గొర్రెలు అమ్మారు. ఆ సమయంలోనే కొన్ని పొట్టేళ్లు మాయమైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీశైలం రోడ్డులో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి పోలీసులు విచారణ చేపట్టారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

● టీడీపీ నేతల దాడిలో గాయపడిన కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పరామర్శ



గాయపడిన వారిని పరామర్శిస్తున్న అన్నా రాంబాబు



కుటుంబ సభ్యులనడిగి వివరాలు తెలుసుకుంటూ..

పొదిలి రూరల్: పొదిలి పట్టణంలోని నవాబుమిట్టలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు షేక్‌మాలిక్, షేక్ లాల్‌బీ, షేక్ మున్నాను ఆదివారం మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అధైర్య పడవద్దని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారన్నారు. చికిత్స పొందుతున్న వారికి ఆర్థిక సహాయం చేశారు. ఆయన వెంట పొదిలి నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, యేలం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మారేడుమల్లి జలపాతంలో మార్కాపురం మెడికో గల్లంతు

మార్కాపురం: మార్కాపురం పట్టణానికి చెందిన సీహెచ్ హరిదీప్ ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం మొత్తం 14 మంది మిత్రులతో కలిసి ఒక టెంపో వాహనంలో అల్లూరి జిల్లా మారేడుమిల్లి జలపాతం దగ్గరకు వెళ్లారు. సరదాగా గడుపుతూ స్నానం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురిసి జలపాతం పొంగి పారడంతో వరద ప్రవాహంలో ఐదుగురు గల్లంతయ్యారు. అయితే ఇద్దరు సురక్షితంగా బయటపడగా ముగ్గురి ఆచూకీ ఇంకా తెలియలేదు. ఇందులో మార్కాపురం పట్టణానికి చెందిన సీహెచ్ హరిదీప్ కూడా ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలి



సంఘీభావం తెలుపుతున్న మాల మహానాడు నాయకులు



పాల్గొన్న మాలలు

● ఆ మేరకు చంద్రబాబును ఒప్పించాలి
● టీడీపీలోని మాల ఎమ్మెల్యేలు, ఎంపీలకు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల సూచన

ఒంగోలు టౌన్: టీడీపీలోని మాల ఎమ్మెల్యేలు, ఎంపీలు చంద్రబాబును ఒప్పించి ఎస్సీ వర్గీకరణను నిలిపివేయించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకటరావు పిలుపునిచ్చారు. నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ, క్రిమీలేయర్ వ్యతిరేక సభలో ఆయన ప్రసంగించారు. రిజర్వేషన్లను దెబ్బతీసే విధంగా ఉన్న సుప్రీంతీర్పును అన్ని రాజకీయ పార్టీలు ఖండించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను కాపాడుకునేందుకు ఆర్టికల్ 35కు ఆర్టికల్ 341కు క్లాజ్ 3 చేర్చి ప్రభుత్వాలు, న్యాయస్థానాలు జోక్యం చేసుకోకుండా రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. దాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. డిసెంబర్ 14వ తేదీ గుంటూరులో తలపెట్టిన మాలల గర్జన సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మాలల ఐక్యతను చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ, క్రిమీలేయర్ తీర్పును పునఃపరిశీలించాలని, ఈ తీర్పును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఇంప్లీట్ పిటీషన్ వేయాలని డిమాండ్ చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అంబేడ్కర్ కల్పించిన హక్కులను కాపాడుకోవడం కోసం మాలలు ప్రాణత్యాగానికి కూడా సిద్ధం కావాలని హైదరాబాద్ ఉర్దూ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జీవీ రత్నాకర్ చెప్పారు. రిజర్వేషన్లను రద్దు చేసే కుట్రలో భాగంగానే వర్గీకరణ, క్రిమీలేయర్ తీర్పులు వచ్చాయన్నారు. న్యాయమూర్తులలో ఒక దళిత సభ్యుడిని నియమించడం వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. మాలలు దేశంలోని 9 రాష్ట్రాలలో గణనీయ సంఖ్యలో ఉన్నారని, తొలి నుంచి నేటి వరకు రాజ్యాంగ పరిరక్షణ కోసం మాలలు ఉద్యమాలు చేస్తున్నారని చెప్పారు. సభకు పెద్ద సంఖ్యలో మాలలు తరలివచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు నేతలు దాసరి శివాజీ, జైం బీం పీపుల్స్ పార్టీ నాయకులు అంబటి కొండల రాయుడు, మాల ఉద్యోగుల సంఘ నాయకులు టి.అశోక్, గోపి, దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, హై జనం పార్టీ నాయకులు చప్పిడి రవిశంకర్, దండెల కృష్ణ, నూకతోటి బాబూరావు, చప్పిడి కోటేశ్వరరావు, మాల మహానాడు అంజయ్య పాల్గొన్నారు.

సమగ్ర విచారణ సాధ్యమేనా..?

● కనిగిరి మున్సిపాలిటీలో రూ.2 కోట్ల నిధుల అక్రమాలపై నేడు విచారణ జరిగే అవకాశం.?
● విచారణ అధికారిగా ఒంగోలు పబ్లిక్ హెల్త్ డీఈ



కనిగిరి మున్సిపల్ కార్యాలయం

కనిగిరి రూరల్: ఒకరు చేసిన తప్పుకు మరొకరు బలికావడం అంటే ఇదేనేమో.. కనిగిరి మున్సిపాలిటీలో గత కమిషనర్ 7 నెలల పాలనలో జరిగిన అవినీతి అక్రమాలు అనేకం. అందులో ఎవరి పాత్ర ఎంత.? ఎవరి వాటా ఎంత.? ఎవరు ఎక్కువ లాభపడ్డారనేది పక్కన పెడితే.. ఓ చిరుద్యోగి చేసిన బిల్లుల సంతకాలు, నిధులు డ్రా చేయడంపై మాత్రం సోమ, మంగళవారాల్లో విచారణ నిర్వహించనున్నట్లు తెలిసింది. గత ఎన్నికలకు ముందు కనిగిరి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి ఇటీవల వరకు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన టీవీ రంగారావు అనేక అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. తాను చినబాబు మనిషిని అంటూ ప్రగల్భాలు పలికి అవినీతికి పాల్పడ్డారని పలువురు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా అనేక బిల్లులు మార్చుకున్నాడనే అభియోగాలున్నాయి. మున్సిపల్ సిబ్బందిని, పట్టణంలోని ప్రముఖులను, వ్యాపారులను.. ఇలా ఎవరినీ వదిలిపెట్టకుండా అందర్నీ బెదిరించి ఇష్టారీతిన దండుకున్నాడని, తన అవినీతి చర్యలన్నింటికీ ఓ సచివాలయ ఉద్యోగిని వినియోగించుకున్నాడని, అర్హత లేకపోయినా సచివాలయ ఎమ్యునిటీ సెక్రటరీకి ఏఈ హోదా కలిస్తూ మున్సిపాలిటీలో ఆ చిరుద్యోగిచేత అనేక బిల్లులు చేయించినట్లు సమాచారం. అందినకాడికి దండుకుని కమిషనర్ సర్దుకునివెళ్లగా, ఆ అక్రమాల పాపం మాత్రం ఆ చిరుద్యోగికి చుట్టుకుంది.

రూ.2 కోట్లకుపైగా అవినీతి..?

మున్సిపాలిటీలో అనధికారింగా సుమారు రూ.2 కోట్లకుపైగా అక్రమ బిల్లులు డ్రా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. వాటి మంజూరు విషయంలో పాత కమిషనర్ చెప్పినట్లు చేస్తే తాము ఇరుక్కుంటామని పలువురు మున్సిపల్ అధికారులు వ్యతిరేకించారు. దీంతో అనేకసార్లు కమిషనర్‌కు, కిందిస్థాయి ఉద్యోగులకు బహిరంగంగా రచ్చ జరిగింది. బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు నుంచి.. చెత్త తరలించే ట్రాక్టర్లకు ఆయిల్ బిల్లులు, ట్యాంకర్ల నీటి రవాణా, మున్సిపల్ కాంట్రాక్ట్ పనులు ఇలా ప్రతి అంశంలో అవినీతి జరిగినట్లు తెలిసింది. వీటిలో కొన్ని బిల్లులు డ్రా చేసుకోగా, మరికొన్ని ఎంబుక్ స్థాయిలో, ప్రీ ఆడిట్ స్థాయిలో ఆగి ఉన్నట్లు సమాచారం. గత మార్చి నుంచి జరిగిన పనులు, బిల్లులు, ఇప్పటి వరకు చేసిన నగదు డ్రాలపై విచారణ, ఆడిట్ నిర్వహిస్తే అవినీతి భాగోతం అంతా వెలుగుచూస్తుంది.

రూ.50 లక్షల బిల్లులపై మాత్రమే విచారణ..?

కనిగిరి మున్సిపాలిటీలో గత 7 నెలల్లో సుమారు రూ.2 కోట్లకుపైగా అవినీతి జరిగినట్లు ప్రచారం ఉన్నా.. కేవలం రూ.50 లక్షల పనులపైనే విచారణ జరిపిస్తున్నట్లు తెలిసింది. కేవలం ఓ చిరుద్యోగి నేతృత్వంలో జరిగిన బిల్లుల డ్రాలపై, చేసిన రికార్డులపై మాత్రమే విచారణ జరుపుతున్నట్లు సమాచారం. శుక్రవారం జరగాల్సిన విచారణ వివిధ కారణాలతో వాయిదా పడగా, దాన్ని సోమ, మంగళవారాల్లో అరకొరగా నిర్వహించనున్నట్లు సమాచారం. విచారణ అధికారిగా ఒంగోలు పబ్లిక్ హెల్త్ డీఈని నియమించగా, సమగ్ర విచారణ జరుగుతుందా..లేదా..? అనేదానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

20 ఏళ్ల తరువాత కుటుంబం చెంతకు..!



కుటుంబ సభ్యులకు అప్పగించిన ఎస్సై సైదుబాబుతో శ్రీహరి (ఎస్సై పక్కనున్న వ్యక్తి)

మార్కాపురం: సుమారు 20 ఏళ్ల కిందట ఇంట్లో చెప్పకుండా వచ్చిన వ్యక్తిని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి వారి చెంతకు చేర్చిన సంఘటన శనివారం అర్ధరాత్రి ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో జరిగింది. పట్టణ ఎస్సై సైదుబాబు శనివారం రాత్రి కొండేపల్లి రోడ్డులో తన జీపులో వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వారిని స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ చేశారు. అందులో ఒక వ్యక్తి తన పేరు సుందరంశెట్టి శ్రీహరి అని తన స్వగ్రామం సింగరాయకొండ మండలం సోమరాజుపల్లి గ్రామమని, తల్లిదండ్రుల పేర్లు శేషమ్మ, కోటేశ్వరరావు అని చెప్పాడు. సరిగ్గా 20 ఏళ్ల క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వచ్చి చిత్తుకాగితాలు, ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుని విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నానని చెప్పాడు. వెంటనే ఎస్సై శింగరాయకొండ పోలీసులను సంప్రదించి వివరాలు తెలుసుకోగా వివరాలు సరిపోవడంతో వారిని వెంటనే పిలిపించి అప్పగించారు. దీంతో 20 ఏళ్లుగా కనిపించకుండా పోయిన కుమారుడు ఒక్కసారిగా కనిపించడంతో తల్లి శేషమ్మ, తమ్ముడు భావోద్వేగానికి గురయ్యారు. సుమారు రెండేళ్లపాటు కుమారుడి కోసం వెతికామని కనిపించక పోవడంతో నిరాశ నిస్పృహలతో ఉన్నామని అన్నారు. ఇలాంటి సమయంలో ఎస్సై సహకారంతో తమ కుమారుడు తమ వద్దకు చేరడం పట్ల సంతోషంగా ఉందని అన్నారు. ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు. కాగా మరో వ్యక్తి తిరుపతి టౌన్ నాలుగుకాళ్ల మండపం ప్రాంతంలో ఉండే గెద్దవోలు కేశవ్‌గా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

ప్రజల మధ్య ఉద్రిక్తతలు సృష్టించడం సరికాదు



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

దర్శి: ప్రజల మధ్య ఉద్రిక్తతలు సృష్టించడం మానుకుని దర్శి అభివృద్ధికి కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లడుతూ.. ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కొంత కాలంగా దర్శి ఉద్రిక్తంగా మారిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దర్శి ప్రాంతంలో 35 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తారని, సాగర్ పూర్తిగా నిండి సముద్రంపాలవుతున్నా ప్రభుత్వం ఇప్పటికీ అధికారకంగా ప్రకాశం జిల్లాకు పూర్తి స్థాయిలో సాగు నీరు ఇస్తామని ప్రకటించకపోవడం అన్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకులు, కూరగాయలు, ఉల్లిపాయలు, వంటనూనె ధరలు ఇటీవల బాగా పెరిగిపోయాయన్నారు. ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం శాఖ మహాసభలు నియోజకవర్గ, గ్రామ స్థాయిలో నిర్వహించాలని తీర్మానించారు. ఉప్పు నారాయణ, కేవీ పిచ్చయ్య, కుందుర్తి అనీల్, ఆంజనేయులు, ఈమని నాగేశ్వర రావు, కర్నా హనుమయ్య, ఎస్‌కే కాలేభాషా పాల్గొన్నారు.